క్లుప్తంగా

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



ఊట్కూరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జమాతే ఇస్లామి హింద్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో ఓటర్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన యువతీయువకులు కొత్త ఓటర్ కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్ద మంజూర్, జావీదు, కోఆప్షన్ మెంబర్ అబ్దుల్‌రహమాన్, లియాకత్‌అలీ, నాసిర్‌ఖాన్, అబ్దుల్‌కాలిక్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే కోర్టులో హాజరుపరచండి

మక్తల్: కేవీపీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, బండారి లక్ష్మయ్యలను వెంటనే కోర్టులో హాజరుపరచాలని ప్రజాసంఘాల నాయకులు బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వారిని అదుపులో తీసుకుని స్వయంగా నారాయణపేట రూరల్ ఎస్‌ఐ జయప్రకాష్ ఫోన్ చేసి మరికల్ పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్తామన్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో సమాచారం తెలుసుకుంటే తమ అదుపులో లేరని పోలీసులు అంటున్నారని తెలిపారు. వెంటనే వారిని కోర్టులో హాజరుపరచాలని, వారికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఉర్సు



మద్దూరు: మండలంలోని మద్దూరు, దమ్‌గాన్‌పూర్‌లో మహిబూబ్‌సుహాని ఉర్సు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం రాత్రి భారీ ఊరేగింపుగా గంధోత్సవం, శుక్రవారం కందూర్లు, భక్తుల మొక్కులు, శనివారం జాతర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



పేటలో శోభాయాత్రను తిలకించడానికి వచ్చిన ప్రజలు



చౌక్‌బజార్‌లో డీజే పాటలకు యువత నృత్యాలు

వేడుకగా అమ్మవారి శోభాయాత్ర



మక్తల్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు



బిజ్వార్‌లో కోలాటం ఆడుతున్న భక్తులు

కోస్గి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు రోజుకో రూపంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక రంగు చీరలు, నైవేద్యాలతో అమ్మవారిని పూజించి శోభయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీ వేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలో, మున్నూర్ వీధిలో ప్రతిష్ఠించిన అమ్మవారితోపాటు మండలంలోని బిజ్జారం, హన్మాన్‌పల్లి, గుండుమాల్, ముశ్రీఫా, చెన్నారంతోపాటు పలు గ్రామాల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహించి అమ్మవారిని జలప్రవేశం చేయించారు.

మక్తల్: పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా చేశారు.

ఊట్కూరు: మండల కేంద్రంతో పాటు బిజ్వార్, పులిమామిడిలో దుర్గామాతను ట్రాక్టర్‌లో ఊరేగించి శోభాయాత్ర చేపట్టారు. భక్తులు దాండియా నృత్యాలు చేశారు. ఊట్కూరులో దుర్గామాతను పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

నర్వ: నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమం మండలంలోని ఆయా గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం, పెద్దకడ్మూర్, లంకాల్, బెక్కర్‌పల్లి, ఎల్లంపల్లిలో అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై అమ్మవారి విగ్రహాల ఉంచి ప్రత్యేక పూజల అనంతరం వాహనాలను కదిలించారు. గ్రామ ముఖ్య కూడళ్లల్లో అమ్మవారి చీరలను వేలం వేశారు.



కోస్గిలో..

ధన్వాడ: మండల కేంద్రంలోని మారుతినగర్, బీసీ కాలనీ, రజకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ట్రాక్టర్‌లలో అమ్మవారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

మరికల్: మండల కేంద్రంలో దుర్గాదేవి నిమజ్జన వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆటపాటల, భజనలతో ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. అంతకు ముందు అమ్మవారి చీరలను వేలం వేయగా భక్తులు దక్కించుకున్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెద్దకడ్మూర్‌లో..



ధన్వాడలో దాండియా ఆడుతున్న మహిళలు



మరికల్‌లో..

వెంకటాపూర్‌ను పంచాయతీ చేసింది మేమే



వెంకటాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్: తీలేర్ పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాపూర్‌ను ప్రత్యేక పంచాయతీ చేసి ఎన్నో ఏళ్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చామని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పూసల్‌పహాడ్, రాకొండ, పెద్దచింతకుంటలో ప్రచారం ముగించుకుని వెంకటాపూర్‌కు రాగానే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహంతో మాట్లాడారు. వెంకటాపూర్‌ను పంచాయతీ చేసింది ఎవరు? మీ గ్రామానికి బీటీ రోడ్డు వేసింది ఎవరు?, ధాన్యం నిల్వల కోసం గోదాంల నిర్మాణానికి చర్యలు తీసుకున్నదని ఎవరని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. గ్రామంలో అభివృద్ధి కాలేదని కాంగ్రెస్ నాయకులు నిరూపిస్తారా అని సవాల్ చేశారు. ఇక్కడ ఎంతో మందికి రైతుబంధు, రైతుబీమా, అర్హులకు ఆసరా పింఛన్లు ఇచ్చింది తమ ప్రభుత్వమేన్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా మళ్లీ అధికారంలోకి రావడం బీఆర్ఎస్ ప్రభుత్వమేన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, తిరుపతయ్య, గోపి, బసంత్, రామస్వామి పాల్గొన్నారు.

ధన్వాడ: నా జీవితం ప్రజలకు అంకితమని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చర్లపల్లి, హన్మన్‌పల్లి, చికర్లగడ్డతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎమ్మెల్యే అడ్డుకున్న యువకులు

చర్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యేను గ్రామ యువకులు అడ్డుకున్నారు. ఇప్పటి వరకు తమకు దళితబంధు ఇవ్వలేదని కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చారని, అలాగే గృహలక్ష్మి ఇవ్వలేదని ఆందోళన చేశారు. వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.

గ్రామగ్రామాన నిరుద్యోగుల నిరసన



నిరసనలో జేఏసీ నాయకులు, నిరుద్యోగులు

కోస్గి: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పి రానున్న ఎన్నికల్లో మెగా డీఎస్సీ, గ్రూప్స్, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా ఉద్యోగాలను భర్తీ చేసేలా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించే పార్టీకే తమ మద్దతు ఇస్తామని నిరుద్యోగ జేఏసీ నాయకులు తెలిపారు. బుధవారం గుండుమాల్ మండలంలోని అమ్లికుంట్ల, బోగారంలో తమ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ సభ్యులు భరత్ కుమార్, మహేష్, కృష్ణ, రాము, రాజప్ప, పవన్, రమేష్ పలువురు పాల్గొన్నారు.

సమస్యల్లో అంగన్‌వాడీ కేంద్రాలు



ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లిలో కమ్యూనిటీ భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

- పిల్లలు, గర్భిణులకు తప్పని పాట్లు
- ఇరుకు గదులు, అద్దె భవనాలు

మక్తల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు అధికంగా ఉండటంతో పిల్లలు, గర్భిణులు, అంగన్‌వాడి టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు ఉన్న చోట తాగునీరు, కరెంటు సమస్యలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో మరుగుదొడ్లు, నీటి సరఫరా లేదు. జిల్లాలోని 11 మండలాల్లో 280 పంచాయతీల్లో 704 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మద్దూరు, నారాయణపేట, మక్తల్ ప్రాజెక్టు పరిధిలో సమస్యలు అధికంగా ఉన్నాయి. జిల్లాలోని 2ఏళ్ల నుంచి 3 ఏళ్ల వరకు 33,214 , మూడేళ్ల నుంచి ఆరేళ్ల వరకు ఉన్న పిల్లలు 27,25, అంగన్‌వాడీ టీచర్లు 639 మంది పనిచేస్తున్నారు. సొంత భవనాలు లేని కేంద్రాలు 180, మరుగుదొడ్లు లేనివి 280 ఉన్నాయి. కొన్ని చోట్ల టీచర్లు లేక ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కొన్ని కేంద్రాలలో ఇరుకు గది ఉండటంతో ఉక్క పెట్టి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసే పౌష్టికాహారం భద్రపరిచేందుకు గదులు లేవు.

సమస్యలను పరిష్కరిస్తాం



మక్తల్, నారాయణపేట, మద్దూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాల్లో సమస్యలను పరిష్కరిస్తాం. పిల్లలు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చే వారికి ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే ఉన్నతాధికారుల అనుమతితతో భర్తీ చేస్తాం.

– వేణుగోపాల్, డీడబ్ల్యూఓ, నారాయణపేట

మద్దూరు: మద్దూరు, కొత్తపల్లి మండలాల్లోని కొమ్మురు, అప్పిరెడ్డిపల్లి, భీంపూర్, మద్దూరు, ఖాజీపూర్, నాగంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వివరిస్తూ, పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

నర్వ: బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దకడ్మూర్‌లోని పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న పార్టీ కేంద్రం వద్ద సమావేశం ఉంటుందని, మండలంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యువకులు అండగా ఉండాలి

కృష్ణా: నియోజకవర్గంలోని యువకులు బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని చిట్టెం చాణిక్యరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గుడెబల్లూర్‌లో యువకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో యువకులు ప్రధాన పాత్ర వహించాలని, ప్రజలకు తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయాలను వివరించాలన్నారు.

దామరగిద్ద: సమర్థుడైన స్థానిక ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితోనే మన ప్రాంత అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ నర్సప్ప, ఆశన్న, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని ఆశన్‌పల్లి, లోకుర్తి, మద్దెల్‌బీడ్ గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



మద్దూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



గుడెబల్లూర్‌లో మాట్లాడుతున్న చిట్టెం చాణిక్యరెడ్డి

నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు



మాట్లాడుతున్న డీఎస్పీ టి.మహేష్

మహబూబ్‌నగర్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి గొడవలు, ఇబ్బందులు సృష్టించరాదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ టి.మహేష్ అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులకు బుధవారం డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి పాత నేరస్తుడు ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని, చిన్న సమస్య సృష్టించినా.. కేసులు నమోదు చేస్తామన్నారు. ఏదైనా గొడవలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాత నేరస్తులు శాంతి భద్రతలకు భంగం కల్గించే కొత్త నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జడ్చర్లలో పద్మవ్యూహాన్ని తలపిస్తున్న సమస్య

- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనదారులు, పాదచారుల నరకయాతన
- బైపాస్, ప్రత్యామ్నాయ మార్గాల అభివృద్ధికి డిమాండ్
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండాలో వెల్లడైన ప్రజల అభిప్రాయాలు

ట్రాఫిక్ తిప్పలు తప్పించండి..

నియోజకవర్గ కేంద్రం, మున్సిపాలిటీ అయిన జడ్చర్లలో ట్రాఫిక్ సమస్య ప్రయాణికులు, పట్టణవాసులను వేధిస్తోంది. సెలవు దినాలు మినహాయిస్తే.. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో అటు క్రాస్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద, ఇటు సిగ్నల్‌గడ్డ అంబేద్కర్, నెహ్రూచౌరస్తాలో ట్రాఫిక్ జాంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ట్రాఫిక్ పద్మవ్యూహం అనే సమస్య నుంచి ఎప్పుడు విముక్తి లభిస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

– జడ్చర్ల టౌన్



167వ నంబరు జాతీయరహదారిపై సిగ్నల్‌గడ్డ వద్ద ట్రాఫిక్ జాం (ఫైల్)

పోలేపల్లిలో ఫార్మసెజ్ ఏర్పాటుతో పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో దినదినాభివృద్ధి చెందుతోంది. దీంతోపాటు 44వ నంబరు జాతీయ రహదారి పట్టణం మీదుగా వెళ్లడం, ప్రస్తుతం రాయచూరు నుంచి కోదాడ వరకు 167వ నంబరు జాతీయ రహదారి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య రెండింతలు అయ్యింది. దీనికితోడు పట్టణంలో సిగ్నల్ గడ్డ వద్ద 750 మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయి.. ఇటీవలే ప్రారంభం కావడంతో సమస్య జఠిలంగా మారింది. 44వ నంబరు జాతీయ రహదారిపై క్రాస్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ కింద తరచూ ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది. ఇక సిగ్నల్‌గడ్డ వద్ద సమస్య గురించి ఎంత చెప్పినా తక్కువే. పనిదినాల్లో ప్రతిరోజు సాయంత్రం గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఆర్‌యూబీ నిర్మాణంతో పాతబజార్ రైల్వేస్టేషన్ వద్ద, నేతాజీ చౌరస్తా, స్టేషన్‌రోడ్డులో కూరగాయలు, రోడ్డు పైనే వాహనాలు నిలిపి ఉంచడం వల్ల, నేతాజీ విగ్రహం వద్ద ఆటోలు రోడ్డుపై నిలిపి ఉంచటం వల్ల అంబులెన్స్ వెళ్లాలన్నా పదినిమిషాలకు పైగా పడుతుంది. ఇలా ఎటు చూసినా ట్రాఫిక్ సమస్యలతో నియోజకవర్గ కేంద్రం పద్మవ్యూహంలా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో ట్రాఫిక్ సమస్యపై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రధాన సమస్య..



పట్టణంలో పరిష్కారం కాని సమస్యల్లో ప్రధానమైనది ట్రాఫిక్. ఎప్పుడు ఏ మార్గంలో వాహనాలు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్లలో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ట్రాఫిక్ సమస్య నియంత్రించాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి. ప్రజలు, వాహనదారుల్లోనూ అవగాహన పెరిగి నిబంధనలు పాటిస్తే సమస్య కొంత తీరుతుంది.

– యాదగిరి, కవి, రచయిత, రిటైర్డ్ ఉద్యోగి, బాదేపల్లి

సమయాల్లో మార్పు చేయాలి



మినీ ఇండియాగా మారిన జడ్చర్లలో ట్రాఫిక్ సమస్యకు కారణం ప్రైవేట్ స్కూళ్లు, వివిధ కంపెనీల బస్సులు ఒకే సమయంలో పట్టణంలోకి రావడమే. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు సమయాల్లో మార్పు చేయడం వల్ల కొంత ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది. అలాగే ఫార్మ సెజ్ కంపెనీల సమయాల్లోనూ మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ పార్కింగ్ ఏరియాలు ప్రారంభించి రోడ్లపై వాహనాలు నిలపకుండా చూడాలి.

– తాహెర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జడ్చర్ల

నిబంధనలు పాటించకే..



పెరిగిన జనాభాకు అనుగుణంగా కొన్ని రోడ్లు వెడల్పు చేసినా నిబంధనలు కఠినంగా అమలు చేయకపోవడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయి. 167వ నంబరు జాతీయ రహదారి కోసం మా ఇల్లు స్వచ్ఛందంగా కోల్పోయి స్థలాన్ని ఇచ్చాం. మాకు ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. ట్రాఫిక్ సమస్య తీరలేదు. సిగ్నల్స్ ఏర్పాటు చేసి నిబంధనలు పూర్తిగా అమలు చేస్తే సమస్య తీవ్రత తగ్గుతుంది.

– శ్రీనివాసులు, నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, జడ్చర్ల

వాకింగ్ ట్రాక్ వేయాలి



సిగ్నల్ గడ్డపై ట్రాఫిక్ జాం అయిన ప్రతిసారి తాలూకా క్లబ్ రోడ్డు ద్వారా 44వ నంబరు జాతీయ రహదారికి వాహనాలు వెళ్తున్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్లడం వల్ల స్కూల్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో పదికిపైగా స్కూళ్లు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్ వేస్తే కొంత వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

– రాధాకృష్ణ, సామాజికవేత్త, బాదేపల్లి

పక్కకు దిగితే పడిపోయినట్లే..

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్రీయ రహదారికి బీటీ వేసిన ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు రోడ్డు పక్కన మట్టివేయడం మరిచారు. కొన్ని చోట్ల వేసిన అది వర్షాల కారణంగా కొట్టుకుపోయి గుంతలుగా మారింది. మాగనూర్ – కొత్తపల్లి, వర్కూర్, ఉజ్జెల్లి, వడ్వాట్ – మందిపల్లి వెళ్లే గ్రామాల రోడ్లు పలు చోట్ల సైడ్ మట్టి లేక ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు పక్కకు దిగితే చాలు పడిపోతామని నిత్యం భయపడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. గతంలో కూడా వీటి వలనే అనేక మంది ప్రమాదాల బారిన పడిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రోడ్డు పక్కకు మట్టి వేయించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



మాగనూర్ - కొత్తపల్లి మధ్యలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు